క్లుప్తంగా

మున్సిపల్ స్థలాల ఆక్రమణ



మున్సిపాలిటీ స్థలంలో కొత్తగా వెలుస్తున్న దుకాణాలు

బొబ్బిలి: పట్టణంలోని మున్సిపల్ స్థలాలను పలువురు ఆక్రమించుకుంటున్నారు.ఆస్థలాల్లో ఎంచక్కా చిన్న చిన్నదుకాణాలు నిర్మించుకుంటున్నా మున్సిపల్ అధికారులకు పట్టడంలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. పట్టణంలోని కోట చుట్టూ తమ ప్రహరీని నిర్మించుకున్నారు. అయితే కోట ప్రహరీ బయట ఉన్న మున్సిపల్ రహదారిపై లక్ష్మీ థియేటర్ ఎదురుగా కొత్తగా షాపులు వెలుస్తున్నాయి.అసలే ఆప్రాంతంలో ట్రాఫిక్ సమస్య ఉంది.అక్కడ కొత్తగా షాపులు నిర్మిస్తుండడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ అధికారులు పట్టించుకుని చ ర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, తదితరులు కోరుతున్నారు.

అసంఘటిత కార్మికులకు ఈ-శ్రమ్ ఓ వరం



ఈ- శ్రమ్ కార్డులకు రిజిస్ట్రేషన్ చేయిస్తున్న సహాయక కార్మిక అధికారి కొండలరావు

సంతకవిటి: 16 నుంచి 59 సంవత్సరాల మధ్య ఉన్న అసంఘటిత కార్మికులకు ఈ-శ్రమ్ ఓ వరమని సహాయక కార్మిక అధికారి కొండలరావు అన్నారు. కావలిలో అసంఘటిత కార్మికులకు గురువారం ఈ-శ్రమ్ కార్డులపై అవగాహన కల్పించడంతో పాటు రిజిస్టర్ చేయించా రు. ఈ-శ్రమ్ కార్డు ఉన్న కార్మికులకు ప్రమాదవశాత్తు పాక్షికంగా అంగవైకల్యం ఏర్పడితే లక్ష రూపాయలు,శాశ్వత వైకల్యం లేదా మరణిస్తే రూ. 2 లక్షల పరిహారం అందుతుందని తెలిపా రు.

చిల్డ్రన్స్ రిట్రీట్‌కు స్పందన



రిట్రీట్‌లో పాల్గొన్న చిన్నారులు

రాజాం: స్థానిక గాయత్రీ కాలనీలో హోసన్న మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చిల్డ్రన్స్ రిట్రీట్‌కు విశేష స్పందన లభిస్తోంది. ఈ సందర్భంగా పాస్టర్ రత్నకుమార్ గురువారం మాట్లాడుతూ.. చిన్నారులు వేసవి సెలవులను వినియోగించుకునేలా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రిట్రీట్‌లో చి న్నారులకు ఆటపాటలతో పాటు నీతి కథలు బోధిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్నవారికి భోజనాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

పోస్టాఫీస్‌లో ఆధార్ సేవలు

రాజాం: పట్టణంలోని పాత ఆర్టీసీ కాంప్లెక్స్ వెనుక ఉన్న పోస్టాఫీస్‌లో ఆధార్ సేవలు అందిస్తున్నామని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ శివ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కొత్త ఆధార్‌కార్డులతో పాటు పాత కార్డులకు సంబంధించి చేర్పులు, మార్పులు చేపడతామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి..



సర్వేను పరిశీలిస్తున్న ఏపీఎం మంగమ్మ

వంగర: మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని వెలుగు ఏపీఎం టి.మంగమ్మ వీఓఏలు, సీసీలకు సూచించారు.అరసాడ,కొప్పరవలస గ్రామాల్లో ఎస్‌హెచ్‌జీ సభ్యులకు సంబంధించి వీఓఏలు, సీసీలు గురువారం చేపట్టిన మెంబర్ ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ సర్వేను ఆమె పరిశీలించారు.ఎస్‌హెచ్‌జీ సభ్యుల పేర్లన్నీ సంబంధిత యాప్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. సర్వేను వేగవంతంచేయా లని ఆదేశించారు.

పరిశీలన

రాజాం సిటీ: కంచరాంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో (ఎస్‌డబ్ల్యూపీసీ) సేంద్రియ ఎరువు తయారీని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. సిబ్బందికి ఆ ఎలు సూచనలు చేశారు. వీలైనంత ఎక్కువ సేంద్రియ ఎరువును తయారు చేసి ఖరీఫ్ సీజన్‌లో రైతులకు విక్రయించాలని చెప్పారు.

బోర్లకు మరమ్మతులు



మరమ్మతులు చేయిస్తున్న జెడ్పీటీసీ నర్సింహులు

రాజాం: పెను బాకలో రెండు తాగునీటి హ్యాండ్ బోర్లకు ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది గురువారం మరమ్మతులు చేశారు. బోర్లు పాడవ్వడంతో గ్రామస్తులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని జెడ్పీటీసీ బండి నర్సింహులు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు తెలియజేశారు. అధికా రులు స్పందించి బోర్లను బాగు చేయించారు. ఈ పనులను జెడ్పీటీసీ పర్యవేక్షించారు.

చినుకు పడితే... ఇక అంతే..!

- అధ్వానంగా రాజాం మున్సిపల్ డ్రైనేజీ వ్యవస్థ
- చిన్నపాటి వర్షాలకే వీధుల్లో ప్రవహిస్తున్న మురుగునీరు
- రోడ్లమీదకు వరదనీటితో చేరుతున్న చెత్తాచెదారం
- ఇబ్బందులు పడుతున్న పట్టణ వాసులు



బుధవారం కురిసిన వర్షానికి మల్లికార్జునకాలనీలో రోడ్డుపై నిలిచిపోయిన వరదనీరు

రాజాం: అధ్వాన డ్రైనేజీ వ్యవస్థతో రాజాం పట్టణ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీ వార్డులో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. కాలువలను ఒకదానితో ఒకటి అనుసంధానం చేయకపోవడం, పల్లపు ప్రాంతాలను గుర్తించకపోవడంతో సమస్యలు అధికమతున్నాయి. ఏటా మున్సిపాలిటీ నిధులు అభివృద్ధి పనుల పేరిట లక్షల్లో మాయమవతున్నా పట్టణంలో సౌకర్యాలు మెరు గుపడడం లేదు. ప్రధానంగా ప్రజలను మురుగునీటి సమస్య వదలడంలేదు. చినుకుపడితే చాలు వీధులన్నీ మురుగుతో దర్శన మిస్తా యి. చిన్నపాటి వర్షాలకే ఎత్తు ప్రాంతాల్లో సైతం మురుగునీరు రోడ్లమీదకు చేరుతుంటుంది. కాలనీల్లో వరద నీరు ఎక్కడిక క్కడ నిలిచిపోతుంది.

ప్రణాళికా లోపం.. ప్రజలకు శాపం

రాజాం మున్సిపాల్టీ పరిధిలో మొత్తం 24 వార్డుల్లోనూ ఏటా ఎక్కడో ఒక చోట సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం చేపడుతూ ఉంటారు. అయితే వీటి నిర్మాణంలో అధికారుల ప్రణాళికా లోపం ఇక్కడి ప్రజలకు శాపంగా మారుతోంది. ఒక కాలువ నుంచి మరో కాలువ కు అనుసంధానం కనిపించడం లేదు. పాడైన కాలువలను బాగుచేయకపోవడం, ఎత్తు ప్రాంతాల నుంచి దిగువ ప్రాంతాలకు నీటిని మళ్లించేలా నిర్మాణాలు చేయకపోవడంతో మురుగునీటి ప్రవాహం సక్రమంగా సాగడం లేదు. వర్షాలు కురిస్తే చాలు బాబానగర్, మల్లికార్జునకాలనీ, వాసవీనగర్, గాయత్రీకాలనీ, ఇందిరమ్మకాలనీ, మెంతిపేట ప్రాంతాలు మురికివాడల్లా మారిపోతాయి. ఈ ప్రాంతాల్లో వరద, మురుగునీరు జనావాసాల్లోకి చేరుతోంది.సమస్యపై ప్రతీ నెల నిర్వహించే టీడీపీ ప్రజాదర్బార్‌లో పలుకాలనీల ప్రజలు స్థానిక ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసినా ఇంత వరకు సమస్య పరిష్కారం కాలేదు.ఇటీవల కురిసిన వర్షాలకు మల్లికార్జునకాలనీ, గాయత్రీ కాలనీ, మెంతిపేట తదితర ప్రాంతాల్లో వరద, మురుగు నీరు కాలువల్లోంచి రోడ్లమీదకు చేరింది.



బొబ్బిలి సెంటర్‌లో రోడ్డు మీదుగా ప్రవహిస్తున్న మురుగునీరు

రహదారి విస్తరణలోనూ అంతే..

ఇటీవల రాజాంలో ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా బొబ్బిలిసెంటర్, డోలపేట సెంటర్, పొనుగుటి వలస సెంటర్‌లో రోడ్డుకు ఇరువైపులా అండర్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేశారు. అయితే దీనికి మిగతా కాలువలను అనుసంధానం చేయలేదు. అలాగే దిగువ ప్రాంతాలకు నీటిని తరలించేలా కాలువల నిర్మాణమూ చేయలేదు. ఫలితంగా ఇటీవల కురిసిన వర్షాలకు నీరు రోడ్ల మీదే నిలిచిపోయింది. ఈరోడ్ల మీదుగానే ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు ఇబ్బందికర పరిస్థితుల్లో రాకపోకలు సాగించాల్సి వస్తోంది.



మల్లికార్జున కాలనీలో ఇంటిముందు చేరిన మురుగు నీరు, చెత్తను దిగువకు తరలించేందుకు పాట్లు పడుతున్న మహిళ

సమస్యను పరిష్కరిస్తాం...



రాజాంలోని ప్రధాన వార్డుల్లో డ్రైనేజీ వ్యవస్థ బాగోలేదు. ప్రజల నుంచి ఫిర్యాదులు కూడా వచ్చాయి. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. గతంలో పట్టణ మురుగునీరు అంతా శివారుకు తరలించేందుకు ప్రణాళికలు రూపొందించాం. వాటికి నిధులు రాలేదు. ప్రస్తుతానికి వార్డుల్లోని మురుగు నీటిని ఆయా వార్డుల శివారు ప్రాంతాల్లోని చెరువులు, కాలువలకు తరలించేందుకు చర్యలు తీసుకుంటాం. బొబ్బిలి సెంటర్‌లోని అండర్ డ్రైనేజీ వ్యవస్థ ఇబ్బందిగా ఉంది. ఈ ప్రాంతాల్లో సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. – జె.రామప్పలనాయుడు, కమిషనర్, రాజాం మున్సిపాలిటీ

ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న లక్ష్మనాయుడు, తదితరులు

బొబ్బిలి: గత ప్రభుత్వం వలే కూటమి ప్రభుత్వం కూడా రైతులను ఆదుకునేందుకు ధరల స్థిరీ కరణ నిధిని ఏర్పాటు చేయాలని రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మునాయుడు డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం రూ.30 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసిందని, పంటలకు గిట్టుబాటు ధరలు లేనప్పుడు వాటి నుంచి సర్దుబాటు చేసి పంట ఉత్పత్తులను కొనుగోలు చేసిందని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్నా ఇంకా రైతుకు సంబంధించిన ఒక్కటంటే ఒక్క సంక్షేమ పథకాన్నీ అమలు చేయలేదన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నా రన్నారు. రబీలో పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా లక్ష్యం అయి పోయిందని చెప్పడం విచారకరమన్నారు. ఉచిత బీమా కానీ సున్నా వడ్డీ కానీ అమలు చేయకుండా ఈ ప్రభుత్వం రైతుల నడ్డి విరుస్తోందని మండిపడ్డా రు. తమ్మిరెడ్డి కృష్ణ, రెడ్డి సత్యనారాయణ, ఎల్.అప్పలనాయుడు, ఆర్.నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

సారా రహిత మండలంగా రామభద్రపురం



మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణరావు

రామభద్రపురం: సారా రహిత మండలంగా రామభద్రపురాన్ని ఎక్సైజ్ సీఐ చిన్నంనాయుడు ప్రకటించారు.నవోదయం-2 కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యా లయం లో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అధ్యక్షతన గురువారం మండలస్థాయి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో ఎక్కడా సారా తయారీ, విక్రయాలు లేకుండా గట్టి నిఘా పెట్టాలని సూచించారు. ఎక్సైజ్ సీఐ మాట్లాడుతూ బీకేటగిరీలోని జోగిందొరవలస గిరిజన గ్రామంతో పాటు మండలంలోని 22 పంచాయతీల్లో నాటుసారా పూర్తిగా లేదని తెలిపారు.దీంతో మండలాన్ని నాటు సారా లేని గ్రీన్ మండలంగా డిక్లేర్ చేసి తీర్మానం చేశారు. ఎంపీడీఓ రత్నం, డీటీ గంగాధర్, ఎస్ఐ వి.ప్రసాదరావు పాల్గొన్నారు.

వినియోగంలోకి ఎస్‌డబ్ల్యూపీసీ



షెడ్డును శుభ్రం చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి పార్వతి

సాక్షి ఎఫెక్ట్

బొబ్బిలిరూరల్: సీతయ్యపేట గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని(ఎస్‌డబ్ల్యూపీసీ) పంచాయతీ అధికారులు వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు ప్రారంభించారు. నిర్వహణ లేకపోవడం, అధికారు లు పట్టించుకోకపోవడంపై 'శిథిలావస్థలో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్' శీర్షికతో సాక్షి దినపత్రికలో గురువారం కథనం ప్రచురితమైంది. దీనికి పంచాయతీ కార్యదర్శి పార్వతి స్పందించారు. షెడ్డును పరిశీలించి శుభ్రం చేయించారు. చెత్త నుంచి సేంద్రియ ఎరువు తయారు చేసేందుకు వీలుగా కుండీలను సిద్ధం చేయించారు. చిన్న పంచాయతీ కావడంతో నిధులు లేవని, తొందర్లో షెడ్‌కు మరమ్మతులు చేయిస్తామని సర్పంచ్ బోను రమాదేవి తెలిపారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు..



పంచాయితీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న డీడీఓ కిరణ్‌కుమార్

బొబ్బిలి రూరల్: పంచాయతీ కార్యదర్శులు విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని డీడీఓ ఎం.కిరణ్‌కుమార్ స్పష్టం చేశారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అప్పగించిన సర్వేలు సక్రమంగా జరగడం లేదని, దీంతో తాము నోటీసులందుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ప్రత్యేకంగా చెత్త సంపద కేంద్రాల నిర్వహణలో కార్యదర్శులు శ్రద్ధ చూపడం లేదని.. ఈ విషయంలో నిర్లక్ష్యం వీడాలని హెచ్చరించారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరా, తదితర అంశాలలో కార్యదర్శులు చురుగ్గా వ్యవహరించాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ పి. రవికుమార్, డిప్యూటీ ఎంపీడీఓ అల్లు భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న వైద్యసిబ్బంది

రేగిడి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడు పిలుపునిచ్చారు. స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో వైద్య సిబ్బందితో కలిసి గురువారం పరిసరాలను పరిశుభ్రం చేసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ఖాళీ ప్రదేశాల్లో, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటేందుకు యువత ముందుకు రావాలని కోరారు. ల్యాబ్ టెక్నీషియన్ రమణ, ఫార్మసిస్టులు ఎం.గోవిందనాయుడు, సతీష్, ఏఎన్ఎంలు, పాల్గొన్నారు.

పైప్‌లైన్ ఏర్పాటుకు ప్రత్యామ్నాయం చూడాలి..

- సీఐటీయూ నాయకులు



బొబ్బిలి రూరల్: చింతాడలో కరపత్రాలను ప్రదర్శిస్తున్న సీఐటీయూ నాయకులు

బొబ్బిలి రూరల్: విశాఖపట్టణం నుంచి రాయ్‌పూర్‌కు హెచ్‌పీసీఎల్ పైప్‌లైన్ ఏర్పాటుకు పలు గ్రామాల్లోని రైతుల నుంచి భూముల సేకరణకు ప్రభుత్వం సిద్ధపడుతోందని.. రైతులు భూములు కోల్పోకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సీఐటీయూ నాయకులు సూచించారు. మండలంలోని చింతాడ, రాముడువలస, కమ్మవలస, తదితర గ్రామాల రైతులకు హెచ్‌పీసీఎల్ పైపులైన్ ఏర్పాటు నేపథ్యంలో ప్రభుత్వం నోటీసులు జారీ చేయగా.. సీఐటీయూ నాయకులు రైతులకు జరుగుతున్న నష్టాన్ని వివరిస్తూ గురువారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. విశాఖ నుంచి రాయ్‌పూర్‌కు వెళ్లే గ్రీన్‌ఫీల్డ్ హైవే పక్కనుంచి పైపులైన్ వేసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. ఇప్పటికే బాడంగి మండలంలో ఆయుధ గిడ్డంగి ఏర్పాటుకు రైతుల నుంచి వందలాది ఎకరాలను ప్రభుత్వం లాగేసుకుందని.. మళ్లీ పైప్‌లైన్ ఏర్పాటుతో రైతులను ఇబ్బంది పెట్టవద్దని కోరారు. కార్యక్రమంలో పి. శంకరరావు, ఆర్.గోపాలం, తదితరులు పాల్గొన్నారు.



బాడంగి: నిరసన తెలియజేస్తున్న కోడూరు రైతులు

భూములివ్వం..

బాడంగి: హెచ్‌పీసీఎల్ పైపులైన్‌కు భూములివ్వమని రైతులతో పాటు సీఐటీయూ నాయకులు స్పష్టం చేశారు. ఈ మేరకు సీఐటీయూ మండల కార్యదర్శి ఎ.సురేష్ ఆధ్వర్యంలో పలువురు రైతులు కోడూరులో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. మండలంలోని పాల్తేరు, మళ్లంపేట, పిన్నవలస, పూడివలస, కోడూరు గ్రామాల రైతులు భూములు కోల్పోవాల్సి వస్తోందన్నారు. పొలాల మధ్య నుంచి పైప్‌లైన్ ఏర్పాటుకు తామంతా వ్యతిరేకమని స్పష్టం చేశారు. ఈ మేరకు ప్రభుత్వం తీరును నిరసిస్తూ శుక్రవారం ఉదయం కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

వేసవి తాపాన్ని తగ్గించే చర్యలు చేపట్టాలి

బాడంగి: వేసవి ఎండల తీవ్రత నుంచి ప్రజలు ఇబ్బందులు పడకుండా షేడ్ నెట్‌ల ఏర్పాటు వంటి చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ ఉండే జంక్షన్లవద్ద, బస్‌స్టాప్‌ల వద్ద, మతపరమైన మందిరాల వద్ద షేడ్‌నెట్‌లు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఇళ్లలో వేడిని తగ్గించేందుకు, జీవ వైవిధ్యాన్ని పెంపొందించేందుకు రూఫ్ టాప్ గార్డెన్స్, మొక్కల పెంపకాన్ని, ప్రభుత్వ కార్యాలయాలు, తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాల ఇళ్లపై తెల్లరంగు సౌరప్రతిబింబ పెయింట్‌లు వేసేలా ప్రోత్సహించాలన్నారు. రోడ్లకు ఇరువైపులా, పార్కుల్లో మొక్కలు నాటాలని ఆదేశించారు.

వికసించిన 'మే' పుష్పాలు



ఏటా మే నెలలో ప్రకృతి ప్రియులను అలరించే మే పుష్పం వికసించింది. తెర్లాం మండల కేంద్రంలోని దత్తి ప్రభావతమ్మ ఇంటి వద్ద పెంచుతున్న మొక్కలకు మే పుష్పాలు తాజాగా వికసించాయి. ఏడాదిలో ఒక్కసారే వికసించే ఈ పుష్పం అందరినీ ఆకట్టుకుంటోంది. మే నెల పూర్తయిన వెంటనే పూలు ఎండిపోయి రాలిపోతాయని, కాండం మాత్రమే మిగులుతుందని ప్రభావతమ్మ తెలిపారు. – తెర్లాం

అధ్వాన రహదారితో అవస్థలు



రాజాం–రామభద్రపురం ఆర్‌అండ్‌బీ రోడ్డు ఉత్తరావల్లి, కూనాయవలస గ్రామాల మధ్య అధ్వానంగా తయారైంది. ఎక్కడికక్కడ గోతులు తేలడంతో ప్రయాణికులు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని నెలల క్రితం ఈ రోడ్డులో మరమ్మతులు చేపట్టి కొంతమేర తారువేశారు. కొంతభాగం మరమ్మతులు చేయ కుండా విడిచిపెట్టేశారు. గోతులు వల్ల ప్రధానంగా ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి పడిపోతుండడంతో వాహన చోదకులు గాయాల పాలవుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని ఆ మార్గంలో నిత్యం రాకపోకలు సాగించే వారు కోరుతున్నారు. – తెర్లాం

ఇంత నిర్లక్ష్యమా...!



మద్దువలస జంక్షన్ వద్ద..



ఉరితోట వద్ద..



మద్దువలస, ఉరితోటకు మధ్య...

రెండు రోజుల క్రితం ఈదురు గాలులతో కురిసిన వర్షానికి వంగర–రాజాం రోడ్డులో మద్దువలస జంక్షన్, స్పీడ్ బ్రేకర్ల సమీపంలో, ఉరి తోట వద్ద చెట్లు కూలిపోయాయి. వాటిని తొలగించడంలో ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆ మార్గంలో ప్రయాణిస్తున్న ప్రజలు మండిపడుతున్నారు. రోడ్డుపై కూలిన చెట్లను స్థానికులు కొంతమేర తొలగించారు. పూర్తిస్థాయిలో కొమ్మలను తొలగించక పోవ డంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి కూలిన చెట్లను తొలగించాలని వారు కోరుతున్నారు. – వంగర

సంఘటితమైతేనే న్యాయం జరుగుతుంది



మాట్లాడుతున్న కరుణకుమార్

బొబ్బిలి: జిల్లాలో కోలాటం కళాకారుల సంఖ్య రాను రానూ పెరుగుతోందని, అంతా సంఘటితమైతేనే కళాకారులు, కళారూపాలకు న్యాయం జరుగుతుందని కోలాటం గురువు జి.కరుణకుమార్ అన్నారు. పట్టణంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో సుమారు 800కు పైగా కోలాటం బృందాలున్నాయన్నారు. ఒక్కో బృందంలో 15 నుంచి 25 మంది కళాకారులు ఉంటారని చెప్పారు. ఈ కళాకారులు వివిధ సందర్భాల్లో ప్రమాదాలు, హఠాత్పరిణామాలతో ఆకస్మికంగా లేదా వృద్ధాప్యం తో మంచానికి పరిమితమవడం, లేదా మృత్యువాత పడడం జరుగుతోందన్నారు. అటువంటి సంఘటనలతో కుటుంబాలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు సంఘటితమై బీమా తదితర సదుపాయాల కోసం ప్రభుత్వాలు, సంస్థలను ఆశ్రయించేందుకు వీలుగా త్వరలోనే ఓ సంఘాన్ని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఉత్తరాంధ్ర పరిధిలో ఉన్న సంఘాల్లో దాదాపు 16వేల మంది కళాకారులంతా ఒకే వేదికపై ఉంటే అటు ఉపాధి ఇటు భద్రతకు అవకాశం ఉంటుందన్నారు. సంఘటితమయ్యేందుకు సంఘంలో చేరేందుకు ఆసక్తి ఉన్న కళాకారులు 77998 08286 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

షట్టర్లు బాగుచేయరూ..



పాడైన షట్టర్లను చూపిస్తున్న రైతులు

రేగిడి: మండలంలోని ఆడవరం గ్రామం వద్ద సాయన్న చానల్ షట్టర్లు పూర్తిగా పాడయ్యాయని, వాటిని బాగుచేయాలని సర్పంచ్ ఈశ్వరమ్మతో పాటు రైతులు అధికారులను కోరారు. సాయన్న చానల్‌ను రైతులతో కలిసి సర్పంచ్ గురువారం పరిశీలించారు. అక్కడి నుంచే ఇరిగేషన్ అధికారులకు రైతులు ఫోన్ చేసి మాట్లాడా రు. చానల్‌లో గుర్రపుడెక్క, కలుపుమొక్కలు తొలగించాలని, షట్టర్లు బాగుచేయా లని కోరారు. తక్షణం ఈ పనులు చేయకుంటే కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. రైతులు రామకృష్ణ, అప్పలనాయుడు, గణపతి రావు, సింహాచలం, బొత్స రామినాయుడు, చక్రధర్, పారన్నా యుడు, లక్ష్మీనారాయణ, శరత్‌కుమార్, రామారావు, రామినాయుడు, తిరుపతిరావు, చిన్నప్పలనాయుడు, వెంకటరమణ పాల్గొన్నారు.

పూడికతీత పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఏపీఓ హరనాథ్

రేగిడి: మండలంలోని కొమిర, ఖండ్యాం, వెంకటాపురం తదితర గ్రామాల్లో పంట పొలాలకు సాగునీరందించే కాలువల్లో ఉపాధి హామీ వేతనదారులు పూడికతో పాటు పిచ్చి మొక్కల తొలగింపు పనులు చేపడుతున్నారు. ఈపనులను ఉపాధి హామీ పథకం ఏపీఓ ఎస్.హరనాథ్ గురువారం పరిశీలించారు. వేతనదారులకు ఆయన పలు సూచనలు చేశారు. కాలువల్లో పూడిక, పిచ్చి మొక్కలను పూర్తిస్థాయిలో తొలగించాలని సూచించారు.

యువతి అదృశ్యం

సంతకవిటి: మండలంలోని షాలీపేట గ్రామానికి చెందిన యువతి అదృశ్యంపై కేసు నమోదు చేశామని ఎస్ఐ ఆర్.గోపాలరావు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం ఇంటర్మీడియట్ పరీక్ష రాయడానికి వెళ్లిన యువతి తిరిగి ఇంటికి రాలేదని , తెలిసిన వారి ఇంటివద్ద వెతికినా ఆచూకీ లభించలేదని యువతి తండ్రి గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. యువతి తండ్రి ఇఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

పరిపాలనా సౌలభ్యం కోసమే...

రామభద్రపురం: పరిపాలనా సౌలభ్యం కోసమే పంచాయతీలను రీ కేటగిరైజేషన్ చేస్తున్నట్లు ఎంపీడీఓ ఎం.రత్నం చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామ పంచాయతీలు ఏడు గ్రేడులుగా ఉన్నాయని,వాటిని మూడు గ్రేడ్‌లుగా చేశారన్నారు.10వేల జనాభా దాటిన పంచాయతీలను స్పెషల్ గ్రేడ్, నాలుగు వేలు దాటి 10 వేల లోపు జనాభా ఉండి గ్రేడ్ 4లో ఉన్న ఆరికతోట, కొట్టక్కి పంచాయతీలను ప్రభుత్వం గ్రేడ్–1 గాను, 2 వేల దాటి 4వేల లోపు జనాభా ఉన్న కొండకెంగువ, కోటశిర్లాం, తారాపురం, నాయుడువలస, రొంపల్లి పంచాయతీలను గ్రేడ్–2గా చేయనుందన్నారు.అలాగే రెండు వేల లోపు జనాబా ఉన్న బూసాయవలస, మిర్తివలస, రావివలస, సోంపురం, గొల్లపేట, ముచ్చర్లవలస, ఇట్లామామిడిపల్లి, పాతరేగ, జన్నివలస, ఎస్.సీతారాంపురం, మామిడివలస, కొత్తరేగ, దుప్పలపూడి, నరసాపురం పంచాయతీలను గ్రేడ్–3 గా చేయనున్నట్లు పేర్కొన్నారు. రామభద్రపురం లాంటి స్పెషల్ గ్రేడ్ పంచాయ తీలకు డిప్యూటీ ఎంపీడీఓ హోదా ఉన్న కార్యదర్శిని నియమిస్తారన్నారు.అలాగే మిగిలిన పంచాయతీల గ్రేడ్‌లను బట్టి సిబ్బందిని సర్దుబాటు చేస్తారని చెప్పారు. మండల పరిషత్ కార్యాలయ ఏఓ సీహెచ్.సన్యాసిరావు ,డిప్యూటీ ఎంపీడీఓ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.